## క్లుప్తంగా

### న్యూటన్‌పాండుకు గురుబ్రహ్మ అవార్డు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు విప్పర్తి ఐజాక్ న్యూటన్‌పాండుకు సెయింట్ మదర్‌థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గురు బ్రహ్మ స్టేట్ అవార్డు– 2025 అందుకున్నట్లు సోమవారం ఆయన తెలిపారు. విశాఖపట్టణం లోని మదర్‌థెరిసా రీజినల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఫౌం డర్ చైర్మన్ కె.కృష్ణమూర్తి చేతుల మీదుగా న్యూటన్‌పాండు ఈ అవార్డు అందుకున్నారు. న్యూటన్‌పాండును ఉపాధ్యాయులు స్వర్ణకు మారి, రోజా, ఉపాధ్యాయ సంఘాల నాయ కులు ప్రత్యేకంగా అభినందించారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం


కంసాలిపాలెంలో కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పల్లారావు, నాయకులు

నిడదవోలు రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉం టామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు భరోసా ఇచ్చారు. మండ లంలోని కంసాలిపాలెంలో ఇటీవల మృతి చెం దిన పార్టీ కార్యకర్తలు కోయి వీరమ్మ, రాములు, సీతమ్మ, మత్తి సరోజిని కుటుంబ సభ్యులను పల్లారావు, పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, పార్టీ నాయకులు బెజవాడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### రేపటితో దరఖాస్తుల స్వీకరణకు గడువు పూర్తి

నిడదవోలు: గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు సంబంధించి దరఖా స్తుల స్వీకరణకు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలతో గడువు ముగుస్తుందని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్జే సతీష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన గీత కులాల వారు దరఖాస్తు చేసుకో వాలన్నారు. జిల్లాలోని గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వం నిర్ణయించిన దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ రుసుం రూ.2 లక్షలు డీడీలను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సై జ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం, ఈస్ట్ గోదావరి పేరున తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సం ప్రదించాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ సతీష్ బాబు తెలిపారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నిడదవోలు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభ ద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. స్థానిక లయన్స్‌క్లబ్ ఆడిటోరింలో సోమవారం అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా నిర్వహించిన సమావే శంలో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. కార్య క్రమంలో కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇం చార్జ్ టీవీ రామారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని రోడ్డులో తాళ్లపూడికి చెందిన చీదేళ్ల వెంకటరాజు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. అతడిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో కాలు విరగడంతో పాటు గాయా లయ్యాయి. క్షతగాత్రుడిని రాజమహేంద్రవ రంలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారు అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై హాస్పటల్ నుంచి సమాచారం రావాల్సి ఉం దని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

### వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నిడదవోలు: వర్గీకరణ సాధనకై హలో మాదిగ ఛలో హైదరాబాద్ లక్షల కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మా ర్పీఎస్ నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో భీమడోలు కిరణ్, బైపే రాజేశ్వరరావు, సనమండ్ర వెంకట్రావు, గెడ్డం రవీంద్ర, తాతపూడి జగదీష్, తానేటి శ్రీను, నేకూరి ప్రవీణ్, ముప్పిడి సతీష్, ఉండ్రాజవరపు వెదుళ్ళరాజు, ఉప్పాటి వెంకటేష్, గాలింకి పవన్, పల్లెటి శివ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం

దేవరపల్లి: గ్రామంలో షిర్డిసాయిబాబా మందిర 29వ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి 8వ తేదీ భీష్మ ఏకాదశి వరకూ నిర్వహిస్తున్నట్టు మం దిర కమిటీ సభ్యులు తెలిపారు. పాంచాహ్నిక దీక్షతో నిత్యహోమాలు, అర్చనలు జరుగుతాయ న్నారు. ఐదు రోజులు జరుగు హోమాలు, పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

# మచ్చే కదా అని వదిలేస్తే ముప్పే..

- ఇంటింటా కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే
- మచ్చలుంటే చూపించాలంటున్న వైద్యులు
- ఈ నెల 13 వరకూ నిర్వహణ

నిడదవోలు: మీ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, తెల్ల రాగి మచ్చలు ఉన్నాయా అయితే జాగ్రత్త.. ఎందు కంటే ఆ మచ్చలతోనే ప్రమాదం ఉంది. శరీరంపై ఎక్కడ మచ్చలున్న మొహమాటం లేకుండా వైద్య సిబ్బందికి చూపించాలి. లేదంటే తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కింద చేపట్టిన కార్యక్రమంలో భాగంగా వైద్యులకు తెలియజే యాలని చెబుతున్నాను. కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపి వ్యాధి నిర్ధారణ సర్వే చేస్తు న్నారు. సర్వేలో భాగంగా అనుమానిత మచ్చలు, తెలుపు, రాగి మచ్చలతో పాటు పొడలు శరీరంపై ఉంటే నిర్భయంగా ఎటువంటి మొహమాటం లేకుండా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి తెలియ జేయాలని అధికారులు కోరుతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ, అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలో ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్నారు. గత నెల 30న ప్రారంభమైన ఈ సర్వే ఈనెల 13 వరకు నిర్వహించనున్నారు. అవసరమైతే వైద్యాధికారులు కూడా సర్వేలో పాల్గొంటున్నారు. ఆరు నెలలకో కసారి చేస్తున్న సర్వేలో ఇప్పటి వరకు నిడదవోలు మండలంలో 09 కుష్టు వ్యాధి కేసులు, కొవ్వూరు మండలంలో 7 కేసులు, పెరవలి మండలంలో 2 కేసులు, దేవరపల్లి మండలంలో 7 కేసులు, చాగల్లు మండలంలో 3 కేసులు, తాళ్లపూడి మండలంలో 6 కేసులు, గోపాలపురం మండలంలో ఒకటి, నల్లజర్ల మండలంలో 3 కేసులు నమోదయ్యాయి.


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


స్పర్శ లేని మచ్చలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

**వివరాలు నమోదు చేస్తూ..**

సర్వేలో భాగంగా శరీరంపై మచ్చలు, అధిక మోతా దులో పొడలు ఉంటే సిబ్బంది వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నారు. అనుమానిత లక్షణాలున్న వ్యక్తిని పరిశీలించి కుష్టు వ్యాధి అవునో కాదో నిర్ధా రణ చేస్తారు. ఒకవేళ కుష్టు వ్యాధిగా తేలితే సంబం ధిత వ్యక్తి పేరు నమోదు చేసుకుని చికిత్స ప్రారం భిస్తారు. ప్రతి నాలుగు నెలలకోసారి ఇంటింటా సర్వే చేయడంతో కుష్టు వ్యాధిగ్రస్తులను కనుగొని చికిత్స ఇవ్వడం ద్వారా అంగవైకల్యం రాకుండా కాపా డవచ్చు. కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా వల్ల వస్తోం ది. ఈ వ్యాధి రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుం ది. ప్రతి ఆరు నెలల నుంచి 5 ఏళ్లలోపు వ్యాధి లక్ష ణాలు బయట పడతారని వైద్యాధికారి తెలుపుతు న్నారు. ఇంటింటా సర్వే చేపట్టిన వివిధ కేసులు కుష్టు అనుమానిత కేసులను గుర్తించడం జరిగింది.

**కుష్టు వ్యాధి లక్షణాలు ఇవే..**

- కాళ్లు చేతులపై స్పర్శ జ్ఞానం లోపించడం
- ముఖంపై చర్మం నూనె రాసినట్లు నిగనిగలాడు తుంది
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- వేళ్లు వంకర్లు తిరగడం, చర్మంపై పొలుపోవడం, రాగి రంగులో కూడిన స్పర్శ లేని మచ్చలుండడం
- కుష్టు వ్యాధి సంబంధించిన మచ్చలపై చెమట పట్టకపోవడం కనుబొమ్మలు లేదా వెంట్రుకలు రాలిపోవడం

**మొహమాటం లేకుండా చెప్పాలి**



ఇంటిని సర్వే చేయడానికి వస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి ప్రజలు సహకరిం చాలి. కుష్టువ్యాధి అని నిర్ధారణ జరిగిన తర్వాత భయపడాల్సిన పని లేదు. ఎండీటీ మందు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గి పోతుంది. శరీరంలో తెలుపు, రాగి మచ్చలను గుర్తించి అనుమానిత వ్యక్తుల పేర్లు నమోదు చేసి వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నాం.

– ఎస్.సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్, నిడదవోలు

**చికిత్స ఇలా..**

బహుళ ఔషధ చికిత్స (ఎడీటీ) ద్వారా కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని వైద్యులు చెబుతు న్నారు. ప్రారంభ దశలో గుర్తించి సక్రమంగా చికిత్స చేయించుకుంటే కుష్టు వ్యాధితో పాటు అం గవైకల్యం రాకుండా నివారించవచ్చు. ఆరు నెలల నుంచి 12 నెలల పాటు ఎండీటీ మందులతో చికిత్స తీసుకుంటే కుష్టు పూర్తిగా నయమవుతోంది. మందులతో చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

### క్రైస్తవ పుణ్యక్షేత్రాలకు బస్సులు


కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి పరిశుద్ధ పంచక్షేత్ర దర్శినికి ప్రత్యేక బస్సులో వెళుతున్న భక్తులు

కొవ్వూరు: ఐదు క్రైస్తవ పుణ్యక్షేత్రాలకు కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతు న్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలి పారు. నాగపట్నంలోని వేళాంకిణి గని మాత ఆలయం, కోయంబత్తూర్‌లోని డాక్టర్ పాల్ దినక రన్ ప్రార్థన మందిరం, చైన్నైలోని డాక్టర్ జీఎస్ దినకరన్ ప్రార్థనా గోపురం, విజయవాడ సమీపం లోని గుణదల మేరీ మాత ఆలయం, గొరీపట్నం లోని నిర్మల గిరి మేరీ మాత ఆలయాలకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. పరిశుద్ధ పంచక్షేత్ర దర్శిని పేరుతో సోమవారం కొవ్వూరు నుంచి బయలుదేరిన ప్రత్యేక బస్సును జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ నెల 2న కుంభ మేళాకు ప్రత్యేక బస్సులు పంపించామన్నారు. ఈ నెల 14న ముస్లిం భక్తుల కోసం అజ్మీర్ యాత్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాత్రలో నాగపూర్, అజ్మీర్, ఆగ్రాలను దర్శించవచ్చని, ఆరు రోజులు పాటు యాత్ర కొనసాగుతుంద న్నారు. ఇందుకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.8,100గా నిర్ణయించామన్నారు. భోజనం, అల్పాహారం, వసతి యాత్రికులే భరించాల్సి ఉం టుందన్నారు. మరిన్ని వివరాలకు ఎస్కే మౌలాలీ 93909 40056 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# బీసీ హాస్టల్‌లో మతపరమైన ప్రార్థన !

- సోషల్ మీడియాలో వీడియోలు హల్‌చల్
- కలెక్టర్ ఆదేశాలతో విచారణ

కొవ్వూరు: పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం యజమాని నిరం జన్ విద్యార్థులు నిద్రించే హాలులో ఆదివారం ప్రార్థన ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. పాస్టర్‌గా పని చేస్తున్న నిరంజన్ పై అంతస్తులను బీసీ హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకు ఇచ్చారు. ఆయన కుటుంబం అదే హాస్టల్‌కు దిగువ అం తస్తులో నివాసం ఉంటోంది. కాగా ఆదివారం పైఅంతస్తు హాస్టల్‌లో బ్యానర్ కట్టి సౌండ్ సిస్టమ్‌తో ప్రార్థన ఏర్పాటు చేశారు. ఆ సమయంలో హాస్టల్‌లో విద్యార్థులు లేరు. సౌండ్ సిస్టమ్ నుంచి శబ్దాలు రావడంతో సమీపంలో ఉండే ఒక నాయకుడి సోదరుడు హాస్టల్‌కు వెళ్లి చూడగా అక్కడ ప్రార్థనకు అవసరమైన ఏర్పాట్లు చేసి ఉన్నాయి. ఈ ఏర్పాట్లను వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయాన్ని స్థానికులు ఆర్డీవో రాణి సుస్మిత దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా బీసీ బాలుర వసతి గృహాన్ని మతపరమైన ప్రచారాలకు వినియో గిస్తున్నట్లు వీడియోలు, ఫొటోలతో కూడిన ఆధా రాలు సమర్పించారు. సమస్యను ఆర్డీవో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. సోషల్ మీడియా, అధికారుల ద్వారా సమాచారం తెలుసు కున్న జిల్లా కలెక్టర్ సైతం ఈ అంశంపై విచారణ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.శశాంక కొవ్వూరులో విచారణ చేపట్టారు. ఆదివారం చోటు చేసుకున్న పరిణామాలపై వివరాలు నమోదు చేసు కున్నారు. ఇక్కడ పనిచేస్తున్న హాస్టల్ వార్డెన్ ఆర్. చిరంజీవి కొవ్వూరుతో పాటు గోపాలపురం వసతి గృహానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ఆయన గోపాలపురం వెళ్లినట్లు చెబుతున్నారు. హాస్టల్‌లో ప్రార్థనలు ఏర్పాటు చేయడం వాస్తవ మేనని, దీనిపై వార్డెన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీస ర్‌కు సమాచారం అందించినట్లు విచారణలో తేలిం దన్నారు. అధికారుల దృష్టికి రావడంతో ప్రార్థనను నిలుపుదల చేసినట్లు ఆమె తెలిపారు. హాస్టల్ భవనం యజమాని రిటైర్డు పాస్టర్ కావడంతో వసతి గృహాన్ని మరో భవనంలోకి మార్పు చేయాలని సూచించామన్నారు. ఈ విచారణపై జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదికను అందజేస్తామని శశాంక తెలిపారు.


కొవ్వూరులో హాస్టల్‌లో వార్డెన్‌ను విచారిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి శశాంక

# వైభవంగా వసంత పంచమి వేడుకలు

- పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు
- సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు

**జ్ఞాన సరస్వతీ ఆలయంలో హోమం**

కొవ్వూరు: వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆల యంలో సోమవారం సరస్వతీ పూజ నిర్వహిం చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు అనం తరం సరస్వతీ హోమం నిర్వహించారు. అధిక సం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లపూడి: మండల వ్యాప్తంగా సోమవారం వసం త పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు పాఠశాలల్లో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. తాళ్లపూడిలోని శ్రీసూర్యా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో పండితులు పరస రాధాకృ ష్ణ ఆధ్వర్యంలో వసంత పంచమి పూజలు నిర్వ హించారు. విద్యార్థులకు సామూహిక అక్షరా భ్యాసం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ కర స్పాండెంట్ ఎం.సీతామహలక్ష్మి, పాఠశాల ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

**చిన్నారులకు అక్షరాభ్యాసం**

గోపాలపురం: వసంత పంచమి సందర్భంగా సోమవారం స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందగిరి గౌతం శర్మ వసంత పంచమి విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా మం గళవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆల యంలో శాంతి హోమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

నల్లజర్ల: వసంతపంచమిని పురస్కరించుకుని సోమవారం అనంతపల్లిలో ఉషోదయ పబ్లిక్ స్కూల్, దూబచర్లలో సంఘమిత్రా విద్యాలయలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వ హించారు. అనంతపల్లిలో 96 మంది చిన్నారు లతో వేదపండితులు అక్షరాభాస్యం చేయించినట్టు కరస్పాండెంట్ మీసాల శ్రీనివాసచెల్లారావు, ప్రిన్సి పాల్ యం.లక్ష్మి తెలిపారు.

దూబచర్లలో భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి పీఠాధిపతి చినవెంకన్నబాబు స్వామిజీ చిన్నా రలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించినట్టు స్కూల్ కరస్పాండెంట్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. చిల్డ్రన్ పార్కును స్వామిజీ ప్రారంభిం చారు.

ఉండ్రాజవరం: విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మం చి పేరు తీసుకు రావాలని ప్రముఖ వక్త వాడ్రేవు సుందర్రావు సూచించారు. మోర్త ఉన్నత పాఠశా లలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వ హించారు. పదో తరగతి విద్యార్థులు సరస్వతీదే వికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.


తాళ్లపూడిలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న విద్యార్థులు


గోపాలపురం లక్ష్మీగణపతి ఆలయంలో చిన్నారులతో చేయిస్తున్న అక్షరాభ్యాసం


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సరస్వతీ హోమం చేస్తున్న పండితులు


అనంతపల్లిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

# సమగ్ర యాజమాన్య పద్ధతులతో మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

చాగల్లు: కోకో సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి బి. సుజాతకుమారి అన్నారు. మండలంలో నెలటూ రులో రైతు కంటిపూడి అచ్యుత రామ ప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కోకో సాగులో తీసు కోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి సుజాతకుమారి మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ వంటి తోటల్లో అంతరపంటగా కోకో సాగు చేస్తే మేలైన దిగుబడితో అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. బెంగళూరు ఐఐపీఎం శాస్త్రవేత్త డి.న బీరసూల్ కోకో తోటలను పరిశీలించారు. రైతుల అనుభవాలను, ధరల విషయంలో ఎదుర్కొం టున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. కోకో గిం జల నాణ్యత పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కొవ్వూరు ఉద్యాన అధికారి శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు ముళ్ళ పూడి మురళీ, ముళ్లపూడి శ్రీనివాస్, గుర్రం లక్ష్మీ నారాయణ, ఆళ్ల సుభాష్, గేదా శ్యామ్, కోడూరి రామకృష్ణ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**సమగ్ర యాజమాన్యంపై అవగాహన**

నల్లజర్ల: కోకోలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మరిన్ని లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.సుజాత కుమారి రైతు లకు వివరించారు. తూర్పు చోడవరంలో సోమవారం సాయంత్రం కోకో రైతులతో సమా వేశం నిర్వహించారు. రైతుల ఇబ్బందులు అడిగి తెల్సుకున్నారు. కోకో తోట నిర్వహణ, దిగుబడి, ధరల వ్యత్యాసంపై బెంగుళూరు నుంచి వచ్చిన డాక్టర్ బి.నబీకుమార్ రైతులు, ఉద్యాన సిబ్బం దితో చర్చించారు. నల్లజర్ల ఉద్యాన అధికారి బబిత మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ తోట లలో అంతర్ పంటగా వేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. దేవరపల్లి ఉద్యానా ధికారి జి.రమేష్ మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలు వివరించారు. మాండిలెస్ కంపెనీ మేనే జరు మనోజ్ మాట్లాడుతూ కోకో గింజల నాణ్యత ఏవిధంగా పెంచుకోవచ్చో వివరిం చారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


తూర్పుచోడవరం సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి సుజాత

# బాలలు ఆరోగ్యంగానే ఉన్నారా..?

- పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు
- వివరాలు యాప్‌లో నమోదు

నల్లజర్ల: పాఠశాల స్థాయిలో విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యారోగ్యశాఖ దృష్టి సారించింది. కేవలం ఆరోగ్య పరమైన అంశాలే కాక పరిసరాల పరిశుభ్రత, పోష కాహారం తదితర అంశాలపై వివరాలు యాప్‌లో పొందు పరుస్తున్నారు. పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోం ది. అంగన్‌వాడీ కేంద్రాలలో అదనపు పోషకాహారం అందిస్తున్నా ఈ సమస్య తగ్గుముఖం పట్టడం లేదు. పాఠశాలలకు వెళ్లే 5సంవత్సరాలు దాటిన విద్యా ర్థుల శారీరక, మానసిక ఎదుగుదల విషయమై గత ప్రభుత్వం దృష్టి సారించి బాల స్వస్థత కార్యక్రమం ఏర్పాటు చేసింది. అదే కొనసాగింపుగా ఈ కార్య క్రమం జరుగుతోంది. పాఠశాలల్లోనే మధ్యాహ్న భో జనాన్ని అందించడంతో పాటు మౌలిక సదుపాయా లను అందిస్తున్నారు. ఎంపీహెచ్‌వో, ఏఎస్ఎం, ఆశా కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులంద రికీ పరీక్షలు చేస్తున్నారు. ఈ ఫలితాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. వీటి వివరాలు డాక్టర్లకు చేరాక వాటిని పరిశీలించి రక్తహీనత, ఎముకుల సాంద్రత వంటి ఇబ్బందులతో బాధ పడుతున్నట్టు గుర్తిస్తే వారికి తగిన ఆరోగ్య సదుపా యాలు కల్పించనున్నట్టు అనంతపల్లి–1 ఎంఎ ల్‌హెచ్‌పీ సంధ్యారాణి, ఏఎన్ఎం దీప్తి తెలిపారు. సోమవారం నుంచే ఈ కార్యక్రమం ప్రారంభమైం దన్నారు. కేవలం ఆరోగ్య పరీక్షలే కాక పాఠశాల పారిశుధ్యం, వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా రా.. లేదా..? నీటి నిల్వలు, రక్షిత మంచినీటి సదు పాయం, మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించి వాటి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నట్టు ఆమె వివరిం చారు. మొదటి రోజు 48 మంది పిల్లలకు పరీక్షలు చేసినట్టు చెప్పారు.


అనంతపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఎంపీహెచ్‌వో సంధ్యారాణి, ఏఎస్ఎం దీప్తి

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నిడదవోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవ ర్నర్ కాకరాల వేణుబాబు పర్యటనలో భాగంగా సోమవారం పలు సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. పట్టణంలోని డీఎస్ఓ మున్సిపల్ హైస్కూల్‌లో ముళ్ళ పూడి హరిచంద్రప్రసాద్ రూ.20 వేలు, లయన్స్‌క్లబ్ రూ.13 వేల ఆర్థిక సహకారం తో నిర్మించిన సైకిల్ షెడ్డును గవర్నర్ ప్రారంభించారు. అదే హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళలో పదో తరగతి విద్యార్థుల అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. లయన్ రంగా వెంకటేశ్వరరావు రూ.23 వేల ఆర్థిక సహకారంతో 25 మందికి యూనిఫాం, హెల్మెట్లు అందించారు. శంకరాపురంలో ఉన్న మానసిక దివ్యాంగుల పునరావాస ప్రత్యేక పాఠశాల నిర్వ హణకు లయన్స్ క్లబ్ తరపున రూ.1.20 లక్షల చెక్కును నిర్వాహకురాలు బి.విశా లాక్షికి అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జ్యేష్ఠ వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతిన రామన్, కోశాధికారి బండి రాంగోపాల్, కొత్తపల్లి రవికుమార్, పీవీ సత్యనారాయణ, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఉండ్రాజవరం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం లో కార్యదర్శులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఈవోపీ ఆర్డీ ఆంజనేయ శర్మ సూచించారు. గ్రామ పారి శుధ్య పర్యవేక్షణ నిమిత్తం మండలంలో పసల పూడి, సూర్యారావుపాలెం, సత్యవాడ గ్రామాల్లో సోమవారం ఆయన మండల పారిశుధ్య సమన్వ యకర్త కత్తుల ప్రకాష్‌తో కలసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాల న్నారు. డ్రైనేజీలను శుభ్రపరిచి, వచ్చిన సిల్ట్‌ను తొలగించి, అక్కడ బ్లీచింగ్ చల్లి బాక్టీరియా ప్రబ లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేయటంలో ప్రతి సర్పంచ్, కార్యదర్శుల సహకారంతో జిల్లా అధికా రుల సూచనలు పాటించి ప్రతి గ్రామాన్ని ఓడీఎఫ్ ప్లస్ స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్య క్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్య దర్శులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com